ముంబై బోణీ

ఐపీఎల్‌లో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ ఎట్టకేలకు పాయింట్ల ఖాతా తెరిచింది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓటమి ఎదుర్కొని ముఖం వాచిపోయిన ముంబై.. సొంతగడ్డపై పరువు దక్కించుకుంది. ఆదివారం డబుల్ హెడర్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన పోరులో ముంబై సమిష్టి ప్రదర్శనతో బోణీ కొట్టింది. ఓపెనర్లు రోహిత్, ఇషాన్ అదిరిపోయే ఆరంభమివ్వగా, ఆఖర్లో రొమారియో షెఫర్డ్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన షెఫర్డ్..నొకియా ఆఖరి ఓవర్లో 4, 6, 6, 6, 4, 6తో ఏకంగా 32 పరుగులు కొల్లగొట్టాడు. లక్ష్యఛేదనలో పృథ్వీషా, ట్రిస్టన్ స్టబ్స్ పోరాటం ఢిల్లీకి ఫలితమివ్వలేదు.

ముంబై: ఐదు సార్లు ఐపీఎల్ చాంపియన్ ముంబై ఇండియన్స్ జూలు విదిల్చింది. కెప్టెన్సీ మార్పునకు తోడు వరుస వైఫల్యాలతో హ్యాట్రిక్ ఓటములతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ముంబై లీగ్‌లో బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 29 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 234/5 స్కోరు చేసింది. రోహిత్‌శర్మ(49), టిమ్ డేవిడ్(45), ఇషాన్ కిషన్(42), రొమారియో షెఫర్డ్(10 బంతుల్లో 39, 3ఫోర్లు, 4 సిక్స్‌లు)రాణించారు. అక్షర్‌పటేల్, నొకియా రెండేసి వికెట్లు తీశారు. ముఖ్యంగా ఇన్నింగ్స్ చివర్లో షెఫర్డ్ కండ్లు చెదిరే రీతిలో బౌండరీలతో వాంఖడే స్టేడియాన్ని హోరెత్తించాడు. లక్ష్యఛేదనలో ఢిల్లీ 205/8 స్కోరుకు పరిమితమైంది. స్టబ్స్(25 బంతుల్లో 71 నాటౌట్, 3ఫోర్లు, 7 సిక్స్‌లు), పృథ్వీషా(40 బంతుల్లో 66, 8ఫోర్లు, 3సిక్స్‌లు) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. కెప్టెన్ రిషబ్ పంత్(1), వార్నర్ (10), అక్షర్‌పటేల్ (8) సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమితమయ్యారు. కొట్జె (4/34)నాలుగు వికెట్లతో విజృంభించగా, బుమ్రా (2/22)ఆకట్టుకున్నాడు. సుడిగాలి ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలకమైన షెఫర్డ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

షెఫర్డ్ నాటు కొట్టుడు:

ముంబైకి ఓపెనర్లు రోహిత్‌శర్మ, ఇషాన్‌కిషన్ మెరుగైన శుభారంభాన్ని అందించారు. గత మ్యాచ్‌లో డకౌట్ అయిన రోహిత్..ఈసారి సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఇషాంత్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్ నుంచే రోహిత్ బౌండరీల దూకుడు కనబరిచాడు. మరో ఎండ్‌లో ఇషాన్ కూడా చెలరేగడంతో ముంబైకి పరుగుల రాక సులువైంది. పంత్ బౌలర్లను మార్చిమార్చి ప్రయోగించినా రోహిత్, ఇషాన్ జోడీ అదే దూకుడు కనబర్చడంతో ముంబై పవర్‌ప్లే ముగిసే సరికి 75 పరుగులు చేసింది. అయితే ఇన్నింగ్స్ జోరు అందుకుంటున్న తరుణంలో అక్షర్ బౌలింగ్‌లో రోహిత్ తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. సూర్యకుమార్‌యాద్(0) ఇలా వచ్చి అలా వెళ్లగా, హార్దిక్ పాండ్యా(39) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. తిలక్‌వర్మ(6) మరోమారు నిరాశపరచగా, చివర్లో టిమ్ డేవిడ్‌తో కలిసి షెఫర్డ్ విధ్వంసం సృష్టించాడు. ఆఖరి ఓవర్‌కు దిగిన నోకియాను లక్ష్యంగా చేసుకుంటూ వరుస బంతుల్లో నాలుగు భారీ సిక్స్‌లు, రెండు ఫోర్లతో స్కోరుబోర్డుకు 32 పరుగులు జతచేశాడు. దీంతో అప్పటి వరకు 202 పరుగులతో ముంబై షెఫర్డ్ దెబ్బకు 234 స్కోరు అందుకుంది.

స్టబ్స్, షా పోరాడినా:

లక్ష్యఛేదనలో ఢిల్లీ..ఆదిలోనే వార్నర్ వికెట్ కోల్పోయింది. ఓపెనర్ పృథ్వీషా.. ముంబై బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ బౌండరీలతో ఆకట్టుకున్నాడు. అభిషేక్ పోరెల్(41)తో కలిసి రెండో వికెట్‌కు షా 88 పరుగులు జోడించాడు. పంత్ తొందరగా ఔట్ కాగా స్టబ్స్ ఒంటరిపోరాటం కనబరిచాడు. సహచరుల నుంచి సరైన సహకారం లేకపోవడంతో స్టబ్స్ ఇన్నింగ్స్ వృథా అయ్యింది.

సంక్షిప్త స్కోర్లు

ముంబై: 20 ఓవర్లలో 234/5(రోహిత్ 49, డేవిడ్ 45, అక్షర్‌పటేల్ 2/35, నోకియా 2/65), **ఢిల్లీ:** 20 ఓవర్లలో 205/8(స్టబ్స్ 71 నాటౌట్, పృథ్వీషా 66, కొట్జె 4/34, బుమ్రా 2/22)

షెఫర్డ్ (10 బంతుల్లో 39*, 3ఫోర్లు, 4 సిక్స్‌లు)

ఢిల్లీపై ఘన విజయం

రొమారియో షెఫర్డ్ వీరవిహారం

10 బంతుల్లో 39 పరుగులు

స్టబ్స్ ఒంటరి పోరాటం వృథా

యశ్ పాంచ్

ఐదు వికెట్లతో విజృంభణ • గుజరాత్‌పై లక్నో ఘన విజయం • రాణించిన స్టాయినిస్, కృనాల్

ఐపీఎల్‌లో లక్నోసూపర్ జెయింట్స్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. లక్ష్యం ఎంత చిన్నదైనా తమ బౌలింగ్ దళంతో లక్నో ప్రత్యర్థి భరతం పడుతున్నది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన పోరులో సమిష్టి ప్రదర్శన కనబరిచిన లక్నో హ్యాట్రిక్ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. నిర్దేశిత లక్ష్యఛేదనలో యువ పేసర్ యశ్ ఠాకూర్ ఐదు వికెట్ల విజృంభణతో గుజరాత్ కుప్పకూలింది. సాయిసుదర్శన్, తెవాటియా ఆకట్టుకున్నారు. తొలుత స్టాయినిస్ అర్ధసెంచరీకి తోడు రాహుల్, పూరన్ రాణింపుతో లక్నో 163 స్కోరు చేసింది.

యశ్ ఠాకూర్ (5/30)

లక్నో: ఐపీఎల్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంది. ఆదివారం జరిగిన పోరులో లక్నో 33 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై ఘన విజయం సాధించింది. మొదట స్టాయినిస్(58), రాహుల్(33), నికోలస్ పూరన్(32 నాటౌట్) రాణించడంతో లక్నో 163/5 స్కోరు చేసింది. ఉమేశ్‌యాదవ్(2/22), దర్శన నల్కందే(2/21) రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనలో గుజరాత్ 18.5 ఓవర్లలో 130 పరుగులకు ఆలౌటైంది. సాయిసుదర్శన్(31), తెవాటియా(30) ఆకట్టుకున్నారు. యశ్ ఠాకూర్(5/30) ఐదు వికెట్లతో గుజరాత్ పతనాన్ని శాసించాడు. కృనాల్ పాండ్యా(3/11) కీలక వికెట్లు తీశాడు. ఐదు వికెట్లతో జట్టు విజయంలో కీలకమైన యశ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

యశ్ విజృంభణ:

నిర్దేశిత లక్ష్యఛేదనలో గుజరాత్‌కు ఓపెనర్లు సుదర్శన్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్(19) మెరుగైన శుభారంభం అందించారు. లక్నో బౌలర్ల సమర్థంగా ఎదుర్కొంటూ పరుగులు రాబట్టడంతో గిల్ వికెట్ కోల్పోయి 54 పరుగులు చేసింది. ఒకానొక దశలో గుజరాత్ సాఫీగా సాగుతున్న సమయంలో యశ్ గిల్ ఔట్‌తో వికెట్ల వేటకు తెరతీశాడు. వైవిధ్యమైన లైన్ అండ్ లెంగ్త్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను యశ్ ముప్పుతిప్పలు పెట్టాడు. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్లు రవి బిష్ణోయ్, కృనాసల్ పాండ్యా కట్టుదిట్టమైన బౌలింగ్‌తో విలియమ్సన్ (1), సుదర్శన్, శరత్(2), దర్శన్ (12) వికెట్లు కోల్పోయింది. దీంతో 80 పరుగులకే టైటాన్స్ సగం వికెట్లు చేజార్చుకుంది. ఒకే ఓవర్లో శంకర్ (17), రషీద్‌ఖాన్(0)ను యశ్ పెవిలియన్ పంపాడు. అదే దూకుడు కనబరుస్తూ తన ఆఖరి ఓవర్లో తెవాటియా, నూర్ అహ్మద్ (4) వికెట్లు తీసిన యశ్..లక్నోకు అద్భుత విజయాన్ని కట్టబెట్టాడు. ఈ క్రమంలో ఐపీఎల్‌లో యశ్ తన తొలి ఐదు వికెట్ల ప్రదర్శన కనబరిచాడు.

సంక్షిప్త స్కోర్లు

లక్నో: 20 ఓవర్లలో 163/5(స్టాయినిస్ 58, రాహుల్ 33, నల్కందే 2/21, ఉమేశ్‌యాదవ్ 2/22), **గుజరాత్:** 18.5 ఓవర్లలో 130 ఆలౌట్(సుదర్శన్ 31, తెవాటియా 30, యశ్ 5/30, కృనాల్ 3/11)

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	4	4	0	1.12	8
కోల్‌కతా	3	3	0	2.51	6
లక్నో	4	3	1	0.77	6
చెన్నై	4	2	2	+0.51	4
హైదరాబాద్	4	2	2	+0.40	4
పంజాబ్	4	2	2	-0.22	4
గుజరాత్	5	2	3	-0.79	4
ముంబై	4	1	3	-0.70	2
బెంగళూరు	5	1	4	-0.84	2
ఢిల్లీ	5	1	4	-1.37	2

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

నాగల్ సంచలనం

• మాంటెకార్లో టోర్నీలో మెయిన్‌డ్రాకు

మాంటెకార్లో: భారత యువ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నాగల్ సంచలనం సృష్టించాడు. ప్రతిష్ఠాత్మక మాంటెకార్లో మాస్టర్స్ టోర్నీలో ప్రధాన రౌండ్‌కు అర్హత సాధించి సత్తాచాటాడు. గత 42 ఏండ్లలో ఈ ఘనత సాధించిన తొలి భారత ప్లేయర్‌గా నాగల్ అరుదైన రికార్డు సాధించాడు. ఆదివారం జరిగిన తుది అర్హత రౌండ్ పోరులో నాగల్ 7-5, 2-6, 6-2తో ఫాకుండో డియాజ్ అకోస్టా(అర్జెంటీనా)పై అద్భుత విజయం సాధించాడు. రెండున్నర గంటల పాటు సాగిన మ్యాచ్‌లో తన(95వ) మెరుగైన ర్యాంక్ (55వ)లో ఉన్న డియాజ్‌ను ఈ యువ ప్లేయర్ మట్టికరిపించాడు. మెయిన్‌డ్రా తొలి మ్యాచ్‌లో మాటియో అర్నాల్డీ(ఇటలీ)తో నాగల్ తలపడుతాడు. 'మాంటెకార్లో ఓపెన్‌లో మెయిన్‌డ్రాకు అర్హత సాధించడం థ్రిల్లింగ్‌గా ఉంది. భారత్ నుంచే ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు దక్కుతున్నాయి' అని నాగల్ అన్నాడు.

విదిత్‌కు ప్రజ్ఞానంద్ చెక్

క్యాండిడేట్స్ చెస్ టోర్నీ

టొరంటో: ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. ఆదివారం జరిగిన మూడో రౌండ్ పోరులో ప్రజ్ఞానంద..భారత్‌కే చెందిన విదిత్ గుజరాతిపై విజయం సాధించాడు. 45 ఎత్తుల్లో ముగిసిన పోరులో ప్రజ్ఞానంద, విదిత్ ఆద్యంతం హోరాహోరీగా తలపడ్డారు. ఆది నుంచే ఈ చెన్నై చిన్నోడు..విదిత్ ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ముందుకు సాగాడు. పుంజుకుని పోటీలోకి వచ్చేందుకు విదిత్ ప్రయత్నించినా అప్పటికే జరుగాల్సిన నష్టం జరిగిపోయింది. మరోవైపు నెపోమినియాచితో పోరును గుకేశ్ డ్రా చేసుకోగా, మహిళల పోరులో వైశాలి..నుర్‌గ్యుల్ సలిమోవాను ఓడించి ముందంజ వేసింది. జోంగ్యి తాన్‌తో గేమ్‌ను హంపి డ్రా చేసుకుంది.

భారత్‌కు మరో ఓటమి

ఆస్ట్రేలియాతో హాకీ సిరీస్

పెర్త్: ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత హాకీ జట్టు వరుస ఓటముల పరంపర దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఆదివారం జరిగిన రెండో పోరులో భారత్ 2-4 తేడాతో ఆసీస్ చేతిలో ఓటమిపాలైంది. గత మ్యాచ్‌తో పోల్చుకుంటే ఒకింత మెరుగ్గా ఆడిన టీమ్‌ఇండియా..ప్రత్యర్థికి తక్కువ గోల్స్ సమర్పించుకుంది. వాస్తవానికి తొలి అర్ధభాగం ముగిసే సరికి భారత్ 2-1 ఆధిక్యంలో నిలిచింది. అయితే మిగిలిన రెండు క్వార్టర్లలో పేలవ డిఫెన్స్‌తో మూల్యం చెల్లించుకుంది. భారత్ తరపున జుగ్‌రాజ్ సింగ్(9ని), కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్(30ని) గోల్స్ చేయగా, జెరెమీ హేవర్డ్(6ని, 34ని), జాకబ్ అండర్సన్(42ని), నాథన్ ఎఫార్మ్స్(45ని) ఆసీస్‌కు గోల్స్ అందించారు. ఈ నెల 10న ఇరు జట్ల మధ్య మూడో మ్యాచ్ జరుగనుంది.

వెర్‌స్టాపెన్‌దే జపాన్ రేసు

సుజుకా(జపాన్): జపనీస్ ఫార్ములా వన్ గ్రాండ్ ప్రి రేసులో మ్యాక్స్ వెర్‌స్టాపెన్ టైటిల్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన తుదిపోరును రెడ్‌బుల్ డ్రైవర్ వెర్‌స్టాపెన్ 1:54:23సెకన్లలో ముగించి టాప్‌లో నిలిచాడు. సెర్గియో పెరెజ్ (రెడ్‌బుల్), కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) పోడియం ఫినిష్ చేశారు. ఈ విజయంతో 26 పాయింట్లు ఖాతాలో వేసుకున్న వెర్‌స్టాపెన్ ఓవరాల్‌గా 77పాయింట్లతో డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. సెర్గియో పెరెజ్ (64), చార్లెస్ లెకెర్క్ (59) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.